
దిలావర్‌పూర్‌లో పోచమ్మ తల్లికి వలతో స్వాగతం పలుకుతున్న భక్తజనం


ఆభరణాల అలంకరణ అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న పోచమ్మ తల్లి

నేత్రపర్వం.. గంగనీళ్ల ఉత్సవం

సారంగాపూర్, దిలావర్‌పూర్ న్యూస్‌టుడే : గంగ నీళ్లు తెచ్చి.. అడెల్లి పోచమ్మకు పోసి.. అంటూ భక్తిపారవశ్యంతో సాగిన గంగనీళ్ల జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం అడెల్లిలోని పోచమ్మ ఆలయం నుంచి ఆభరణాలతో గోదావరి తీరానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు ఆదివారం రాత్రి ఆలయానికి తిరిగి వచ్చారు. వెండి కడవలో తీసుకొచ్చిన గోదావరి జలం, స్థానిక కోనేటి నీటితో ఈవో రమేష్ ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసశర్మ పోచమ్మ తల్లికి అభిషేకించి ఆభరణాలను అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం వేకువ జామున గోదావరి నీటితో అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేసి తిరిగి శనివారం వెళ్లిన గ్రామాల మీదుగా పాదయాత్రగా రాత్రి 7.30 గంటలకు అడెల్లి ఆలయానికి చేరుకున్నారు. ఊరూరా మహిళలు మంగళహారతులు, డప్పువాయిద్యాలతో పోచమ్మ ఆభరణాలకు స్వాగతం పలికారు. ఆ తల్లి ఆభరణాలను చేతితో తాకారు.

చారిత్రక ఆలయం.. సంప్రదాయాలకు నిలయం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : చారిత్రక నేపథ్యం ఉన్న జిల్లా కేంద్రంలోని అంకం రాజుల గుడి వద్ద ఆదివారం సాయంత్రం చందాకార్ ఆత్రం వంశస్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని గోండు రాజులు పాలించినట్లుగా చరిత్రకారులు చెబుతుంటారు. ఏటా విజయదశమికి ముందు ఆ వంశం వారసులు సంప్రదాయబద్ధంగా పూజలు చేయడం ఆనవాయితీ. డోలు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ ఆలయం వరకు ప్రదర్శన చేపట్టిన అనంతరం గుడిలో, అంకం రాజుల సమాధి వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ గుడికి 13, 14వ శతాబ్దాల చరిత్ర కలిగినట్లు ఆత్రం వంశస్థులు పేర్కొన్నారు. ప్రస్తుత వారసులు ఆత్రం పాండు, భుజంగ్‌రావు, దిలీప్, రాంషావ్ కుటుంబాలు ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.


పూజలు చేస్తున్న ఆత్రం వంశస్థులు

ఎగవేతదారులకే ఎందుకు కేటాయింపు?

● సీఎంఆర్ అప్పగింతలో ఎడతెగని జాప్యం!

వానకాలం (ఖరీఫ్) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర నుంచి వడ్లు పోటెత్తే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో ఎక్కడా చెక్‌పోస్టులు లేకపోవడంతో.. రేషన్ బియ్యం విచ్చలవిడిగా సరిహద్దు దాటుతున్న విషయం విదితమే. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, పోలీసులు సంయుక్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చడం లేదు. బియ్యాన్ని సకాలంలో ఇవ్వకుండా రెండు, మూడు సంవత్సరాల నుంచి తప్పించుకు తిరుగుతున్న వారిని బ్లాక్ లిస్టులో పెట్టి, మళ్లీ ధాన్యం కేటాయించవద్దనే ప్రభుత్వ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు.

ఈనాడు, ఆసిఫాబాద్, మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

పైసా పెట్టుబడి లేకుండా రూ.కోట్లలో ధాన్యం నిల్వలు పొంది సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రూపంలో ఇచ్చే బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లను అధికారులు డిఫాల్టర్లుగా (ఎగవేతదారుగా) గుర్తించారు. 25 శాతం అదనంగా వీరు బియ్యం ఇవ్వాలని ఆదేశాలు చేసి ఏళ్లు గడుస్తున్నా.. మిల్లర్లు పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. తుది గడువు ఎప్పటికప్పుడు పొడిగించడం, నేతల అండదండలతో బియ్యాన్ని ఇవ్వకపోవడం వంటి ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. రూ.కోట్ల విలువైన సీఎంఆర్ సకాలంలో రాకపోవడం, మరో పక్షం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య మరింత జటిలంగా మారనుంది.

2023-24 సంవత్సరంలో రావాల్సిన సీఎంఆర్ బియ్యం బకాయిలు (మెట్రిక్ టన్నుల్లో)
■ జిల్లా ■ ఖరీఫ్ ■ రబీ

జిల్లా	ఖరీఫ్	రబీ
మంచిర్యాల	35,764	33,162
కుమురంభీం	432	7,175
నిర్మల్	65,487	96,248
ఆదిలాబాద్	262	2,456


చెన్నూరు సమీపంలో ఉన్న రైస్ మిల్లు ఇది. మూడేళ్లలో రూ.1.32 కోట్ల సీఎంఆర్ బియ్యం ఇక్కడి నుంచి రాకపోవడంతో అధికారులు సీజ్ చేశారు.

● ఒక్కసారి డిఫాల్టర్లుగా మిల్లర్లను గుర్తించిన అధికారులు మళ్లీ ఎందుకు వారికే ధాన్యం నిల్వలు కేటాయిస్తున్నారో అంతుపట్టని విషయంగా మారుతోంది. బియ్యం ఇవ్వని వారికి 25 శాతం అదనంతోపాటు, 12 శాతం వడ్డీ, బ్యాంకు గ్యారెంటీలతో సీఎంఆర్‌ను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. కానీ పూర్తి స్థాయిలో సఫలం కావడం లేదు. ఈలోపే మరో సీజన్‌కు సంబంధించిన కొనుగోళ్లు ప్రారంభం కావడంతో బియ్యం ఇచ్చే గడువు పెంచుకుంటూ పోతున్నారు.

జిల్లాల్లో పరిశీలిస్తే..

◆ మంచిర్యాలలో 39 మిల్లులను డిఫాల్టర్లుగా అధికారులు గుర్తించారు. 2019-20, 2021-22, 2022-23 మూడేళ్ల పరిధిలో 9008.76 మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా రావాల్సి ఉంది. రూ.32.42 కోట్ల విలువైన బియ్యం రావాలి.

◆ నిర్మల్ జిల్లాలో 9 మిల్లులను డిఫాల్టర్లు ప్రకటించారు. వీటి నుంచి ఏడు వేల మెట్రిక్ టన్నులు బియ్యం అంటే రూ.27 కోట్ల విలువైనవి రావాల్సి ఉంది. 2023-24లో రెండు సీజన్లకు సంబంధించి 1,41,223 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు ఉన్నాయి.

◆ కుమురం భీం జిల్లాలో 2024 రబీ సీజన్‌కు సంబంధించి 16 మిల్లులకు ధాన్యం ఇచ్చారు. ఇందులో సెప్టెంబరు 30వ తేదీ వరకు 6 శాతం మాత్రమే సీఎంఆర్ వచ్చింది. 13 మిల్లుల నుంచి వచ్చింది సున్నా.

కొలిక్కిరాని ఎస్పీఎం, లారీ అసోసియేషన్ వివాదం

కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం, లారీ అసోసియేషన్ మధ్య నెలకొన్న వివాదం కొలిక్కిరాలేదు. పక్షం రోజులుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. యాజమాన్యం స్పందించకపోవడంతో మిల్లు నుంచి పేపర్ లోడ్‌తో వెళ్తున్న లారీలను లారీ అసోసియేషన్ ఎదుట నిలిపివేశారు. అసోసియేషన్ సభ్యులు శనివారం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించగా, మిల్లు కార్మికులు సైతం తమ సమస్యను చెప్పుకొన్న విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసోసియేషన్, ఎస్పీఎం ప్రతినిధులు, రవాణాశాఖ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. పెరుగుతున్న డీజిల్ ధరలు, ఇన్సూరెన్స్, టోల్ టాక్స్, ఇతర ఖర్చులు పెరిగాయని, నిత్యం పెరుగుతున్న ధరలకు అనుకూలంగా లారీలకు యాజమాన్యం కిరాయి ఇవ్వడంలేదని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అగ్రిమెంట్ ప్రకారం తాము కిరాయి చెల్లిస్తున్నామని, మూడు నెలలకోసారి తాము పెంచుతూనే ఉన్నామని, మళ్లీ పెంచడం మిల్లుకు సాధ్యం కాదని ఎస్పీఎం ప్రతినిధులు తెలిపారు. కాగా ఎలాంటి పురోగతి లేకుండానే చర్చలు ముగిశాయి. లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని భారాస నాయకులు లెండుగురె శ్యాంరావు, సయ్యద్ మోయినోద్దీన్, నక్క మనోహర్, అంజన్న, శోభన్‌లు సందర్శించి అసోసియేషన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు.


లారీ అసోసియేషన్‌కు మద్దతు తెలుపుతున్న భారాస నాయకులు

వార సంత.. ట్రాఫిక్ చింత

కాగజ్‌నగర్ పట్టణంలో వాహనాల పార్కింగ్ ఇష్టారీతిన సాగుతోంది. మార్కెట్ ఏరియాలో ప్రధానంగా వాహనాల పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. ఆదివారం వారసంత కావడంతో.. మార్కెట్ ఏరియా, అంబేడ్కర్ చౌక్, పొట్టిశ్రీరాములు చౌక్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమయ్యాయి. పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో ఆయా వ్యాపార సముదాయాల ముందు పలువురు తమ వాహనాలను నిలుపుతున్నారు. రోడ్లపై సైతం నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మార్కెట్‌లోకి లారీ వచ్చిందంటే చాలు వెనకా ముందు ఏ వాహనం కదలలేని పరిస్థితి. రోడ్లపై వాహనాలు నిలిపిన క్రమంలో పోలీసుల జరిమానాలు వేస్తున్నారే తప్ప వాహనాల పార్కింగ్‌కు పటిష్ఠ చర్యలు చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, కాగజ్‌నగర్


అంబేడ్కర్ చౌరస్తాలో అస్తవ్యస్తంగా వచ్చి ఇరుక్కుపోయిన వాహనాలు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో-కన్వీనర్‌గా రవీందర్



రెబ్బెన, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో-కన్వీనర్‌గా గోలేటి గ్రామానికి చెందిన దుర్గం రవీందర్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

మంచినీటి సహాయకులొస్తున్నారు..

ఆసిఫాబాద్, వాంకిడి, న్యూస్‌టుడే

జిల్లాలోని ప్రతి పంచాయతీకి ఒక కార్మికుడిని గ్రామ మంచినీటి సహాయకునిగా, పెద్ద పంచాయతీల్లో ఇద్దరిని తీసుకున్నారు. ఎంపీడబ్ల్యూ లేనిచోట గ్రామంలో సామాజికసేవ కలిగిన ఉత్సాహవంతుడిని ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 351 మందిని ఎంపిక చేసి మిషన్ భగీరథ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తున్నారు. జిల్లా నుంచి హైదరాబాద్‌లో శిక్షణ పొందిన నలుగురు మాస్టర్ ట్రైనర్లు విడతల వారీగా శిక్షణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆసిఫాబాద్ డివిజన్‌లో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కెరమెరి మండలాలకు, కాగజ్‌నగర్ డివిజన్‌లో ఏడు మండలాలకు శిక్షణ పూర్తి చేశారు. ఇంకా జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో శిక్షణ మొదలు పెట్టారు.

మిషన్ భగీరథ పథకంలో భాగంగా చాలాచోట్ల పైప్‌లైన్లు వేయకపోవడం, వేసిన చోట లీకేజీలు ఏర్పడటం, ట్యాంకులు సరిగా శుభ్రం చేయకపోవడంతో పలు ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తున్నాయి. కొన్నిచోట్ల మరమ్మతుల జాప్యంతో నీరంతా వృథా అవుతున్నాయి. గమనించిన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం కోసం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. పంచాయతీల్లోని మల్టీపర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) లేదా ఇతరులకు శిక్షణ ఇప్పించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టింది.


నీటి నాణ్యత పరిశీలనపై సహాయకులకు శిక్షణ

శిక్షణ ఇలా..

గ్రామాల్లో చేతిపంపుల మరమ్మతులు చేయడం, ఒకటి, మూడు హెచ్‌పీ సామర్థ్యం కలిగిన విద్యుత్తు మోటార్లకు సంబంధించి చిన్నచిన్న మరమ్మతులు, లీకేజీలను అరికట్టడం, నిత్యం నీటి నాణ్యతను పరిశీలించేలా.. నాలుగు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి పది రోజులకోసారి నెలలో మూడు సార్లు నీటి ట్యాంకులను (1వ, 10వ, 21వ తేదీ) కడగాలి. నిత్యం క్లోరిన్ పరీక్షలు చేయాలి. ట్యాంకుకు ఎక్కించిన నీటిలో క్లోరిన్ 2 పీపీఎం ఉండాలి. తక్కువ ఉంటే బకెట్ నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ కలిపి 15 నిమిషాల తరువాత పైన పేరుకున్న నీటిని ట్యాంకులో పోయాలి. అరగంట తరువాత కుళాయిలకు నీటిని విడుదల చేయాలి. అప్పుడు కూడా ట్యాంకు దగ్గరి మొదటి ఇంటి వద్ద సహాయకులకు ఇచ్చిన క్లోరోస్కోప్ ద్వారా నీటి నాణ్యత పరీక్షించాల్సి ఉంటుంది.

సత్వర పరిష్కారానికి అవకాశం..

తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడినా, మరమ్మతుల కోసం సంబంధిత మెకానిక్‌లు వచ్చే వరకు ఆగాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో నెలల తరబడి మరమ్మతులకు నోచుకోకుండా నీరంతా వృథాగా పోయేవి. ప్రస్తుతం ప్రతి గ్రామానికి సహాయకుడు ఉండడంతో వీరే పరిష్కరించే అవకాశం ఉంటుంది. లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చేయించేలా చూస్తారు. లీకేజీలతో తాగునీరు కలుషితం కావడం, రంగు మారిన నీళ్లు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. నిత్యం నీరు నాణ్యత పరీక్షలు చేయనుండడంతో శుద్ధనీరు లభించే అవకాశం ఏర్పడుతుంది.

మొత్తం పంచాయతీలు	ఎంపిక చేసిన గ్రామ మంచినీటి సహాయకులు	భగీరథ నీటి సరఫరా మండలాలు	నీటి సరఫరా చేస్తున్న ఆవాసాలు	నిర్మించిన ట్యాంకులు	నిర్మించిన పైప్‌లైన్
335	351	15	1,144	909	1557 కిలోమీటర్లు

విద్యార్థి కంటికి సురక్ష

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

ప్రస్తుత జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో విద్యార్థుల్లో రోజురోజుకూ కంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. విద్యార్థులు చరవాణిలో ఆటలకు అలవాటు పడి ఆరుబయట ఆటలపై ఆసక్తి కోల్పోతున్నారు. సెలవులు వచ్చాయంటే చరవాణిలో కేటాయించే సమయం మరింతగా పెరుగుతోంది. దీంతో దృష్టి లోపంతో చిన్నారులకు తరగతి గదిలో బోర్డుపై రాస్తున్న అక్షరాలు, పుస్తకాల్లో చిన్న అక్షరాలు స్పష్టంగా కనిపించని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆడుకునే వయసులోనే కంటి అద్దాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు వినడానికి చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు స్మార్ట్ ఫోన్లు కొనిచ్చారు. అప్పటి నుంచి అలవాటుగా మారి తదనంతరం తల్లిదండ్రుల పర్యవేక్షణలేక గాడితప్పి సమస్య మరింత పెరిగింది. పోషకాహారలోపంతోనూ సమస్యలు వస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తొలిదశలోనే సమస్య గుర్తించి పరిష్కరించాలని కుటుంబ, ఆరోగ్యసంక్షేమ శాఖ ప్రత్యేకంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది.



జిల్లాలో కంటి పరీక్షలు నిర్వహించిన విద్యార్థుల వివరాలు

తరగతి	విద్యార్థుల సంఖ్య
5	189
6	914
7	886
8	774
9	1095
10	1011

కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులు : 114

ప్రభుత్వ బడుల్లో పరీక్షలు

రాష్ట్ర బాల సురక్ష కార్యక్రమం కంటి వైద్యుల అనుసంధానంతో ఆగస్టు నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. జిల్లా రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 5,019 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా.. 62 మంది విద్యార్థులు కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. దసరా సెలవుల అనంతరం విరివిగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

విద్యాసంవత్సరం ముగింపు వరకు..

ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశుభ్రత, అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ జ్వరాలు వచ్చిన వారికి చికిత్సలు చేయిస్తున్నారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి అద్దాలు, మందులు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఆదేశాలు రావడంతో పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. విద్యాసంవత్సరం ముగింపు వరకు 5-10 తరగతి విద్యార్థులకు పరీక్షలు చేపట్టనున్నట్టు వివరించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు ముమ్మరం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చరవాణి వినియోగం తగ్గించాలి

- జగన్మోహన్, కంటి వైద్య నిపుణులు

ఒకప్పుడు వృద్ధులకు కంటి సమస్యలు ఉండేవి. ప్రస్తుతం విద్యార్థి దశలోనే సమస్య రావడం ఆందోళనకరం. కంటి సమస్యలకు ప్రధాన కారణం అతిగా టీవీ, చరవాణులు వినియోగించడమే. వాటిని వీలైనంత వరకు తగ్గించాలి. దసరా సెలవులతోపాటు సాధారణ రోజుల్లో సైతం చరవాణిలో ఆటలకు బదులు ఆరుబయట ఆటలు ఆడడం అలవాటు చేసుకోవాలి. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన ఆహారం అందిస్తే చాలా వరకు సమస్యల్ని దూరం చేయొచ్చు.


కప్ అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ బాలుర జట్టు క్రీడాకారులు

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

రెబ్బెన, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో రంగారెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జట్ల మధ్య పోటీ జరిగిందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి తెలిపారు. రెండో స్థానం బహుమతి సాధించిన జిల్లా బాలుర జట్టు క్రీడాకారులను జిల్లా అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, టగ్ ఆఫ్ వార్ జిల్లా అధ్యక్షుడు కె.భాస్కర్, సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి యు.శంకర్ అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ మైనార్టీ ఫంక్షన్ హాలులో వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వివిధ ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం జమాతే ఇస్లామి హింద్ కాగజ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. గత నెలలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే అంశంపై పట్టణంలోని ఉర్దూ పాఠశాలలు దంతన్‌గూడ, ఆర్బీ, సర్‌సిల్క్, మార్కెట్ ఏరియా విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. జమాతే ఇస్లామి హింద్ జిల్లా కన్వీనర్ నజీమా ఫయాజ్ ఉన్నీసా, ఉపాధ్యాయురాలు వసీంసుల్తానా, తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి ఘాట్ అందాలు



వేసవిలో..

ప్రకృతి ఒడిలో.. మలుపుల్లో

కుమురం భీం జిల్లాలోని కెరమెరి ఘాట్ ప్రకృతి రమణీయతను సంతరించుకుంది. ఒక్కో సీజన్‌లో ఒక్కోరకంగా మారుతూ ఉంటుంది. మలుపులతో కూడిన దాదాపు ఐదు కిలోమీటర్ల ఘాట్ ప్రయాణం ఆహ్లాదాన్నిస్తుంది. చుట్టూ ఎటు చూసినా ఎత్తైన చెట్లతో కూడి పచ్చదనం పర్చుకుని పక్షుల కిలకిలారావాలు, చల్లని గాలి మధ్య ప్రయాణికులు చక్కటి అనుభూతికి లోనవుతారు. అదే వేసవి సమయంలో ఆకులన్నీ రాలిపోయి మోడువారిపోయిన చెట్లతో కనిపిస్తుంది. మూడు నెలల కిందటి వరకు సరైన వానలు లేక ఇలా.. ప్రస్తుతం భారీ వర్షాలతో చెట్లన్నీ చిగురించి చూపరులను ఎంతోగానో ఆకట్టుకుంటోంది. ఆ చిత్రాలే ఇవి. - న్యూస్‌టుడే, కెరమెరి



కూష్మాండ దేవి అలంకరణలోని అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు



ఆలయంలో భక్తుల సందడి

కూష్మాండ దేవిగా బాసర అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం సరస్వతి అమ్మవారు కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి రాజోపచార, చతుషష్టి పూజలు నిర్వహించారు. నవరాత్రులతోపాటు ఆదివారం సెలవు కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. కోటి గాజుల మండపంలో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన పలువురు విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మైదానం అనుకుంటే.. గుర్రపుడెక్కలో కాలేసినట్లే!



గుర్రపుడెక్క పేరుకుపోయిన ఖానాపూర్ చెరువు

పచ్చటి మైదానంలా కనిపిస్తున్న ఇది ఖానాపూర్ చెరువు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 114 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఈ చెరువులో చేపలను పెంచి.. విక్రయించి గంగపుత్ర కుటుంబాలు ఉపాధి పొందేవి. తర్వాత చెరువు ఆక్రమణలకు గురికావడంతో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.4.89 కోట్లు వెచ్చించి సుందరీకరణ, అభివృద్ధి పనులు ప్రారంభించారు. పనుల్లో నాణ్యత లేని కారణంగా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఈ చెరువు కాలుష్య కారకంగా మారింది. పట్టణంలోని మురుగంతా చెరువులో చేరుతుండగా.. మరోవైపు చెరువు మొత్తం ఇలా గుర్రపుడెక్కతో నిండిపోయి కంపుకొడుతోంది.

- ఈనాడు, ఆదిలాబాద్



ఇక క్రీడా పండగ

● 16 నుంచి సీఎం కప్ పోటీలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడా విభాగం :

యువతలో క్రీడా సంస్కృతి పెంపొందించాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారు విశ్వ క్రీడల్లో పతకాలు సాధించాలన్న ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా చీఫ్ మినిస్టర్(సీఎం) కప్-2024 నిర్వహించనుంది. ఈ నెల 16 నుంచి విడతల వారీగా గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలలో ఆయా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించేందుకు షెడ్యూలును ఖరారు చేసింది. ఈ రెండు నెలల పాటు ఉమ్మడి జిల్లాలోని మైదానాలు పోటీలతో కళకళలాడడమే కాకుండా క్రీడా పండగ వాతావరణం నెలకొంటుంది. వర్ధమాన క్రీడాకారులకు తమ ప్రతిభ చాటేందుకు ఇదొక చక్కని వేదిక అవుతుంది.



హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం కప్-2024 పోటీల లోగో మస్కట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మండలస్థాయి : ఈ నెల 22 నుంచి 26 వరకు

జిల్లాస్థాయి.. నవంబరు 4 నుంచి 8 వరకు

అథ్లెటిక్స్.. 100మీ., 400మీ.ల పరుగు, మహిళల వాకింగ్ 400 మీ.లు, పురుషులకు వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో

బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్

బాక్సింగ్ : 46, 48, 51, 54, 54-57, 57-60 కిలోల బరువు విభాగాలు

ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ., బెస్ట్ స్ట్రోక్ 50మీ., బ్యాక్ స్ట్రోక్ 50మీ., బటర్‌ఫ్లై 50మీ.

కుస్తీ : 57, 65, 74, 86 కిలోల బరువు విభాగాలు

ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ జట్లు

పోటీలు ఇలా..

సబ్ జూనియర్(14 ఏళ్ల లోపు), యూత్/జూనియర్(18 ఏళ్ల లోపు), మెన్ అండ్ వుమెన్ ఓపెన్(18 ఏళ్లు దాటినవారు) విభాగాల్లో పోటీలు ఉంటాయి.

గ్రామీణస్థాయి..

ఈ నెల 16 నుంచి 19 వరకు.. (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్)

(అథ్లెటిక్స్ విభాగంలో 100 మీ, 400 మీ.ల పరుగు, మహిళలకు వాకింగ్ 400 మీ.లు, పురుషుల వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో)

రాష్ట్రస్థాయి.. నవంబరు 18 నుంచి 22 వరకు



అథ్లెటిక్స్ : 100మీ., 400మీ.ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, మహిళల వాకింగ్ 400మీ.లు, పురుషుల వాకింగ్ 800మీ.లు, షాట్‌పుట్



బాక్సింగ్ : 46-48 కిలోలు, 51-54 „ , 54-57 „ , 57-60 „




విలువిద్య : ఇండియన్ రౌండ్ 30మీ.లు, రికర్వ్ రౌండ్ 60మీ.లు, కంపౌండ్ రౌండ్ 60మీ.లు



ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ.లు, బ్రెస్ట్ స్ట్రోక్ 50మీ.లు, బ్యాక్ స్ట్రోక్ 50మీ.లు, బటర్‌ఫ్లై 50మీ.లు.



బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్



కుస్తీ : 57 కిలోలు, 65 కిలోలు, 74 కిలోలు, 86 కిలోలు



షూటింగ్: పిస్టల్ ఈవెంట్స్ 10 మీ.లు, రైఫిల్ 10 మీ.లు, ఓపెన్ సైట్ 10మీ.లు



టేబుల్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్



లాన్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్



జిమ్నాస్టిక్స్ : ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, పొమ్మెల్ హార్స్, రోమన్ రింగ్స్, టేబుల్ వాల్ట్



వెయిట్ లిఫ్టింగ్ : 49 కిలోలు, 55 కిలోలు, 61 కిలోలు, 67 కిలోలు, బాలికల కోసం ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, బ్యాలెన్స్ బీమ్, అనివెన్ బార్, టేబుల్ వాల్ట్



బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, సెపక్‌తక్రా జట్లు

వీరికి బాధ్యతలు..

ఉమ్మడి జిల్లాలో సీఎం కప్ పోటీలు క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా యువజన క్రీడల అధికారులకు అందాయి. జిల్లా విద్యాశాఖతో పాటు అన్ని క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ఇందులో భాగస్వాములు కానున్నారు.

క్రీడా జ్యోతి పరుగు..

సీఎం కప్ పోటీల నేపథ్యంలో తెలంగాణలోని 33 జిల్లాల్లో క్రీడా జ్యోతి పరుగు నిర్వహిస్తున్నారు. ఈ నెల 6న నిర్మల్, ఆదిలాబాద్, 7న ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో క్రీడా జ్యోతి పరుగు ఉంటుందని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయం సిబ్బంది పేర్కొన్నారు.

లఘుచిత్రం.. సంస్కృతి ఔన్నత్యం



న్యూస్‌టుడే, దండేపల్లి :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిబింబం బతుకమ్మ పండగ. తొమ్మిది రోజుల పాటు పల్లెల్లో సందడి చేసే ఈ పండగ మన మధ్య స్నేహభావం, ఆత్మీయత, అనుబంధాలు పెంపొందిస్తాయి. పాటల్లో జానపద, చారిత్రకమైన పలు సామాజిక అంశాల పరమార్థాన్ని తెలియజేస్తాయి. ఇంతటి విశిష్టత ఉన్న పండగ గొప్పదనంపై లఘుచిత్రాలను రూపొందిస్తూనే మరోవైపు సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపుతూ దేవాలయాల విశిష్టతను వివరిస్తూ.. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేస్తున్నారు. తాము రూపొందించిన చిత్రాలు, జానపద గేయాలను ప్రపంచానికి తెలిపే విధంగా వివిధ యూట్యూబ్ ఛానళ్లలో విడుదల చేస్తున్నారు.

పండగల గొప్పదనాన్ని వివరిస్తూ..

బతుకమ్మ పండగ వచ్చిందంటే దేశ విదేశాల్లో ఉన్న వారు సైతం పల్లెలకు వచ్చి ఆనాటి అనుబంధాలను గుర్తు చేసుకుంటారు. డీజేలు, సౌండ్ బాక్సులు, కోలాటాలకే పరిమితం అవుతున్న నేటి తరుణంలో పండగ విశిష్టత, పాటల్లో దాగి ఉన్న పరమార్థం, గొప్పదనాన్ని తెలుపుతూ మహిళల్లో చైతన్యం నింపేలా జానపద గేయాలు రూపొందిస్తున్నారు భీమారం మండలం దాంపూర్‌కు చెందిన చేగొండ నిరోషా. స్వీయ రచన, నటన, ఎడిటింగ్ చేసి చిత్రాలను నిర్మించి వీటిని యూట్యూబ్‌లో 'ఎంఎస్‌ఎస్ ఫోక్ వీడియో' ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.



బతుకమ్మ ఆట చిత్రీకరిస్తున్న దృశ్యం

దేవాలయాల విశిష్టతను తెలియజేస్తూ..

తెలంగాణ పండగలతో పాటు పురాతన దేవాలయాల చరిత్రను తెలియజేస్తూ లఘు చిత్రాలు, వీడియోలు నిర్మిస్తున్నారు లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన చిలుకూరి స్వాతి. తెలంగాణలో చారిత్రాత్మక దేవాలయాలు ఉన్నా చాలా మందికి వీటి గురించి తెలియవు. వీటి చరిత్ర, గొప్పదనాన్ని వివరిస్తూ చిత్రాలు నిర్మించి 'ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్ ఆఫ్ యూనివర్స్' అనే ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. వీటితో పాటు బతుకమ్మ విశిష్టత, పండగలకు పుట్టింటితో ఉండే అనుబంధాలను తెలియజేస్తున్నారు.



బతుకమ్మ పాటను చిత్రీకరిస్తూ..

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా...



అల్లూరి సీతారామరాజు లఘు చిత్రం నిర్మాణంలో..

విజ్ఞానం, వినోదంతో పాటు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన లఘు చిత్రాలు నిర్మిస్తున్నారు మంచిర్యాలకు చెందిన బద్రి రమారాణి. జిజ్ఞాస అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి దీనిద్వారా సమాజహితమైన చిత్రాలను నిర్మిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, వారసత్వం, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు చిత్రాలను రూపొందించారు. తెలుగు బోధకురాలైన ఈమె పలు తెలుగు పాఠాలను సైతం గ్రాఫిక్స్‌లో రూపొందిస్తున్నారు.



డబ్బింగ్ చెబుతూ రమారాణి

పల్లె సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

పల్లె సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు నృత్యాలతో కూడిన జానపద గేయాలు నిర్మిస్తున్నారు దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన ముల్కల్ల మురళి. నటన, దర్శకత్వంలో రాణిస్తూ గుర్తింపు పొందుతున్నారు. యూట్యూబ్‌లో ఫోక్ బ్యాండ్, రుచిత క్రియేషన్స్ ఛానల్‌లో తన వీడియోలు ఉంచుతున్నారు. పల్లెల్లో బతుకమ్మ సందడితో పాటు పట్టణాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి పండగ వేళ పల్లెలకు వచ్చే మహిళలు తమ పుట్టింటితో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తున్నారు. ఇలా పలు వీడియోలను రూపొందిస్తున్నారు.



పాట ప్రారంభోత్సవంలో మురళి

నవోదయలో ప్రవేశాలకు ఆఖరి అవకాశం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు సోమవారంతో గడువు ముగియనుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. దీంతోపాటు 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు సైతం దరఖాస్తులను చేసుకోవాలని, వీటి గడువు ఈ నెల 30తో ముగియనుందని పేర్కొన్నారు. 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశాలకు మొదట సెప్టెంబరు 16వ తేదీ ఆఖరిగా నిర్ణయించినా.. తదనంతరం పొడిగించిదన్నారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గాంధీ నుంచి బాధితురాలి డిశ్చార్జి

జైనూరు: జైనూర్ మండలంలో జరిగిన హత్యాచారయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళ గాంధీ ఆసుపత్రిలో కోలుకుని ఆదివారం డిశ్చార్జి అయ్యింది. మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆసుపత్రికి వచ్చి ఆమె యోగక్షేమాలు తెలుసుకొని, సొంతూరికి పంపించారు.



పోచమ్మ ఆభరణాలను ఎత్తుకున్న ఎస్పీ జానకి షర్మిల



సాంగ్వి గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగలు శుభ్రం చేస్తున్న పూజారులు



సారంగాపూర్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

జనగంగ.. జాతర మురవంగ

దిలావర్‌పూర్, సారంగాపూర్ న్యూస్‌టుడే : గంగనీళ్ల జాతరలో భాగంగా అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాలతో వచ్చిన పూజారులు శనివారం రాత్రి దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి పోచమ్మ ఆలయంలో జాగరణ చేశారు. ఆదివారం వేకువజామున ఇదే గ్రామ శివారులోని గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. తిరిగి అడెల్లి ఆలయానికి చేరుకునే క్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం గ్రామాల భక్తజనం బండారి, కొబ్బరినీళ్లు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల జాతరలో పాల్గొన్నారు. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు దిలావర్‌పూర్‌లో ఇంటి ఆడపడుచులు స్వగ్రామానికి రావడం ఆనవాయితీ. దీంతో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది. దీంతోపాటు గ్రామంలో ఏర్పాటు చేసే ఇథనాల్ పరిశ్రమను తరలించాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున నినాదాలతో పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

దుస్తులు అమ్మి..
బడిపంతులుగా ఎంపికై



వారసంతలో చెలిమెల రాజు..

న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ : వారిది పెద్ద కుటుంబం.. అతడు పదో తరగతి వరకు చదవడమే కష్టమైంది. తల్లి కూరగాయల విక్రయం.. తండ్రి వీధుల్లో, వారసంతలో దుస్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వారి కష్టాన్ని చూసి తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లకు పెద్దన్నగా మారారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించగానే ఆపేశారు. తాను కూడా తండ్రిలాగే ద్విచక్రవాహనంపై వెళ్లి గ్రామాలు, వారసంతల్లో విక్రయించారు. పదేళ్ల తరువాత దూరవిద్య ద్వారా డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేశారు. పట్టుదలతో చదివి సర్కారు ఉద్యోగాలు సాధించారు మంచిర్యాల జిల్లాకు చెందిన చెలిమెల రాజు. ఆయన ప్రస్తుత డీఎస్సీలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంకు సాధించారు.

పదేళ్లు ఆపేసి.. ఆపై ప్రయత్నించి

లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన లక్ష్మి, రాయమల్లు దంపతుల పెద్ద కుమారుడు రాజు. అతడి తమ్ముడు ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో డీసీటీఓగా కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ కలిసి ముగ్గురు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. తండ్రి అయిదేళ్ల క్రితం మరణించగా అతనే ఇంటికి పెద్దదిక్కయ్యారు. కాగా తన పదో తరగతి 1998లోనే పూర్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రుల కష్టాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో చదువును పక్కనపెట్టారు. ఇంటికి చేదోడుగా ఉంటూనే సర్కారు కొలువు సాధించాలనే ఆలోచనలో పడ్డారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. 2008-2011లో దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తిచేశారు. గురుకుల కొలువుల ప్రకటన వెలువడటంతో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అక్కడ విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో ర్యాంకు సాధించి ఎంపికయ్యారు. భాషా (తెలుగు) పండితుడిగా జిల్లాలో మూడో ర్యాంకు సొంతం చేసుకున్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సులువే అని నిరూపించారు రాజు. చదువుకు విరామం వచ్చిందని, విశ్రమించకుండా ఆలస్యమైనా తన లక్ష్యానికి చేరువయ్యారు.

నాలుగు ఉద్యోగాలతో సత్తా



కాందేకర్ శివాజీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఓ అభ్యర్థి ఏకంగా డీఎస్సీ-2024 ఫలితాల జాబితాలో వేర్వేరు కేటగిరిల నాలుగు టీచరు పోస్టులకు ఎంపిక కావడం విశేషం. మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ దుబ్బగూడకు చెందిన నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కాందేకర్ హన్మాండ్లు-లలిత దంపతుల కుమారుడు శివాజీ స్కూల్ అసిస్టెంటు ఫిజికల్ సైన్సులో రెండో ర్యాంకు, ఎస్‌ఏ తెలుగులో 15వ ర్యాంకు, భాషా పండిత(ఎల్‌పీ) కేటగిరిలో 32వ ర్యాంకు, ఎస్జీటీ విభాగంలో 70వ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని గ్రహించిన విద్యాశాఖ శనివారం ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికైన వారిని డైట్ కళాశాలకు పిలిపించి వారి నుంచి ఏ పోస్టుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారో అభ్యర్థన పత్రాన్ని తీసుకున్నారు. నాలుగింటిలో ఫిజికల్ సైన్సు ఉద్యోగానికి శివాజీ తొలి ప్రాధాన్యం ఇస్తూ ఆ పత్రాన్ని సమర్పించారు. శివాజీ డిగ్రీ తర్వాత ఎంఎస్సీ(కెమిస్ట్రీ), ఎంఏ(తెలుగు), బీఎడ్, డీఎడ్‌తో పాటు భాషా పండిత కోర్సులు పూర్తి చేశారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, తదితరులు

బంజారా సమాజ్ ఉన్నతికి కట్టుబడి ఉన్నాం

ఎదులాపురం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బంజారా సమాజ్ ఉన్నతి కోసం కట్టుబడి ఉన్నామని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేశారు. ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2 కోట్లతో ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించతలపెట్టిన బంజారా భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్‌తో కలిసి ఎంపీ గోడం నగేష్ భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బంజారా సంప్రదాయం ప్రకారం జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్, సంత్ శ్రీరామారావు మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్ సమర్పించారు. సకల హంగులతో భవన నిర్మాణానికి ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్ సహకరించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. అనంతరం ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మాజీ ఎంపీ రాఠోడ్ రమేష్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అమర్‌సింగ్ తిలావత్(ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు), జనార్దన్ రాఠోడ్(జడ్పీ మాజీ ఛైర్మన్), రూపావత్ అమర్‌సింగ్, రాఠోడ్ సజన్, రాఠోడ్ భీంరావు(ఈఈటీడబ్ల్యూ), రాఠోడ్ సురేష్(ఈఈఆర్అండ్‌బీ), జాదవ్ నరేష్, రాఠోడ్ బాబూలాల్(ఏబీఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి), రాఠోడ్ బాబురావు చౌహాన్(మాజీ మంత్రి కర్ణాటక), రాఠోడ్ రామారావు, కిషన్ చౌహాన్, శ్రావణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం

? పట్టణంలోని ప్రధాన రహదారి లారీ చౌరస్తా నుంచి ఇ.ఎస్.ఐ ఆసుపత్రి వరకు రోడ్డు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నాం. -మమత, స్థానికురాలు

✔ ఈ రోడ్డును శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. - అంజయ్య, కమిషనర్, పురపాలిక సంఘం

న్యూస్‌టుడే, వాంకిడి

? మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి కంపుకొడుతోంది. దోమలు పెరిగి ఇబ్బందిగా తయారైంది. అధికారులు స్పందించి కాలువలు శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలి. - నాగరాజు, ఇందిరానగర్ కాలనీ

✔ రెండు రోజుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - శివకుమార్, గ్రామకార్యదర్శి, వాంకిడి

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్

? జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఆర్ఆర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ చీకటితో ఇబ్బందిగా మారింది. పుర అధికారులు చర్యలు తీసుకోవాలి - రమేశ్, కాలనీవాసి

✔ జిల్లా కేంద్రంలో విడతల వారీగా విద్యుత్తు బల్బులు అమరుస్తున్నాం. ఆర్ఆర్ కాలనీలో అమర్చేలా చూస్తాం - భుజంగ్‌రావు, పుర కమిషనర్

నేర వార్తలు

పురుగుమందు తాగి యువకుడి బలవన్మరణం

కౌటాల, న్యూస్‌టుడే : మండలంలోని సాండ్‌గాం గ్రామానికి చెందిన కోబ్రగడే మనోహర్(28) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మనోహర్‌కు ఏడేళ్ల కిందట వివాహమైంది. అతని భార్య కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. భార్యకు వైద్యం చేసేందుకు డబ్బులు లేక మనస్తాపానికి గురైన మనోహర్ మద్యానికి బానిసయ్యాడు. తాగిన మైకంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి స్పృహ కోల్పోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వారు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి దత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆసిఫాబాద్ మండలంలో వివాహిత..

ఆసిఫాబాద్: మండలంలోని రహపల్లికి చెందిన బొందుబాయి(42) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. వివరాల ప్రకారం.. భార్యాభర్తలైన మనోహర్, బొందుబాయిలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా బొందుబాయి మద్యం అలవాటు చేసుకుంది. భర్త వద్దని వారించేవాడు. శనివారం రాత్రి ఇంట్లో మద్యం మత్తులో పురుగుమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని కోమటిగూడలో ఆదివారం సాయంత్రం రైతు వాడై రమేష్(35) తన చేనులో విద్యుదాఘాతానికి గురయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్‌కు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడం, మరమ్మతులపై అవగాహన ఉండటంతో కొంత కాలంగా విద్యుత్తు సంబంధిత పనులు చేస్తున్నారు. ఆదివారం తన చేనులో బోరుబావికి మోటారు బిగించి నియంత్రిక నుంచి విద్యుత్తు అనుసంధానం చేయాల్సి ఉంది. ఈక్రమంలో లైన్‌మెన్ వెంకటేష్‌కు సమాచారం అందించడంతో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. రమేష్ నియంత్రికకు మోటారు తీగలను జత చేసే సమయంలో విద్యుత్తు సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుడి చేతికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

ఎనిమిది మందికి జైలు



చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఖర్జెల్లి రేంజి పరిధి కోర్సిని గ్రామ శివారులో ఉన్న అటవీ ప్రాంతంలో భూమిని సాగు చేస్తున్న ఎనిమిది మందిని అధికారులు శనివారం రిమాండ్‌కు తరలించారు. డిప్యూటీ రేంజర్ హైమవతి తెలిపిన వివరాల ప్రకారం.. ఖర్జెల్లి రేంజి పరిధిలోని కోర్సిని బీట్‌లో కోర్సిని గ్రామానికి చెందిన సునీల్, చంద్రగిరి రాజేష్, ఎలుపుల శంకర్, అత్తేల రమేష్, ఎలుపుల సత్తయ్య, బొల్లబోయిన యాదవ్, నర్మ్మలే యాదవ్, పోశెట్టి వెంకటేష్‌లు చెట్లు నరికి, అటవీ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. అధికారులు వారిని అదుపులోకి తీసుకొని సిర్పూర్(టి) సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. అడవిలో చెట్లను నరికి భూమి ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కోర్సిని బీట్ అధికారి ప్రభాకర్, తదితరులున్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రన్‌వెల్లి గ్రామంలో కొనసాగుతున్న గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ గుడుంబా తయారు చేస్తున్న క్రమంలో పట్టుబడిందన్నారు. ఆమె వద్ద 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన జాలోత్ జేత్య అనే వ్యక్తి వద్ద 20లీటర్ల గుడుంబా లభించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తిర్యాణి: మండలంలోని చింతపల్లి గ్రామంలో కోలా పున్నంగౌడ్ ఇంటి ఆవరణలో ఆదివారం మూడున్నర లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు తిర్యాణి ఎస్సై మాధవ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఇంటిని సోదా చేయగా గుడుంబా తయారు చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మండలంలో బెల్లం అమ్మినా, గుడుంబా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పశువుల పట్టివేత

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలో శనివారం రాత్రి అక్రమంగా పశువులను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గిరవెల్లి గ్రామ శివారులోని ఎర్రవాగు సమీపంలో పశువులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేశామన్నారు. 26 పశువులు కబేళాకు తీసుకెళ్తున్నారని తెలియడంతో వాటిని గోశాలకు తరలించామన్నారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలోని చింతపుడి గ్రామానికి చెందిన హైమద్, నాయిని శ్రీనివాస్, సంజీవ్, గంట శంకర్‌లపై కేసునమోదు చేశామని తెలిపారు.

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. మూడు పశువులను కౌటాల మార్కెట్ నుంచి వాహనంలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న అబ్దుల్ రహీం ఖురేషీ, అహ్మద్ హుస్సేన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైభవోపేతంగా శరన్నవరాత్రులు

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం లలితాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

తిర్యాణి, దహెగాం: తిర్యాణిలో నాలుగో రోజు ఆదివారం లలితాత్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. కన్యక పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. భీమారం హనుమాన్ ఆలయంలో అర్చకులు విజయ్‌కుమార్ హోమం చేశారు. దహెగాం మండల కేంద్రంలో అన్నపూర్ణేశ్వరిదేవి అవతారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు.

రెబ్బెన: ఇందిరానగర్‌లోని దుర్గామాత ఆలయంలో లలితాత్రిపుర సుందరి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, తహసీల్దార్ పి.రామ్మోహన్ రావులతోపాటు సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ రంగు



తిర్యాణిలో హోమం చేస్తున్న దంపతులు

మహేష్‌గౌడ్ కుటుంబ సభ్యులు, గోలేటి టౌన్‌షిప్‌లోని దుర్గాభవానీ మండపంలో ఎస్సై చంద్రశేఖర్ సందర్శించారు. పూజలు చేసి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. అర్చకుడు దేవర వినోద్, నిర్వాహకులు దుర్గం రవీందర్, పూదరి సాయి, సల్ల మహేష్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంతో పాటు బంబార, ఖమాన, ఇంధాని గ్రామాల్లో శారదాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాగజ్‌నగర్: నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవోపేతంగా సాగుతున్నాయి. ఆదివారం లలితాత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

వాడవాడలా బతుకమ్మల సందడి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కాలనీల్లో ఆదివారం బతుకమ్మల సందడి నెలకొంది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా కదలి వచ్చి ఆట పాటలతో సంబరాల్లో తేలిపోయారు. దాండియా, కోలాటం ఆడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, బజార్‌వాడి, జన్కాపూర్, బ్రాహ్మణ్‌వాడ, బాపునగర్, సందీప్‌నగర్, పైకాజీనగర్.. తదితర కాలనీల్లో బతుకమ్మ పాటలతో మారుమోగింది.

రెబ్బెన: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబరాలు కనులపండువగా కొనసాగాయి. గోలేటిలోని కార్మిక వాడలు, నవేగాం, నంబాల, రెబ్బెన, ఇందిరానగర్, వంకులం, ఖైర్‌గాం తదితర గ్రామాల్లో మహిళలు రాత్రి వరకు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.



ఇందిరానగర్ దుర్గామాత ఆలయంలో.. జీఎం శ్రీనివాస్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు దంపతులు



వాంకిడి ఇందిరానగర్ కాలనీ మండపంలో..



ఆదర్శ యూత్ దుర్గా మండలిలో..



ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

పాఠశాలలో పనులు ప్రారంభం

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలలో గత వారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేసి బస చేసిన విషయం విదితమే. గదుల్లో ఫ్యాన్లు, లైట్లు అమర్చాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. ఆదివారం ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో పాఠశాలలో పనులు ప్రారంభించారు. ఆవరణలో పిచ్చి మొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగింపజేశారు. గదుల్లో ఫ్యాన్లు మరమ్మతులు చేయించారు.

భాజపా సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు చివరి అంకంలో ఉన్న సందర్భంగా కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున చేయించాలన్నారు. ఈ నమోదుకు కేవలం పది రోజులు ఉన్నందున త్వరితగతిన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి మనోహర్ గౌడ్, సీనియర్ నాయకులు ఎల్ములే మల్లయ్య, చౌదరి నానయ్య, సత్పుతే తుకారం, సుశీల్ మండల్, పవన్ పురోహిత్, మోహన్, ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : భాజపా బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకొని బూత్‌లో సభ్యత్వ నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల స్పెషల్ డ్రైవ్ బూత్ ఇన్‌ఛార్జులుగా సంతోష్, సాయికిరణ్‌లను నియమించారు. తాలుకా కన్వీనర్ వీరభద్రాచారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్, మండల అధ్యక్షుడు మధుకర్, నాయకులు కాంతారావు, హరీష్, నానయ్య, ప్రభాకర్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వాలీబాల్ పోటీలు ప్రారంభం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని సోమిని గ్రామంలో కుమురంభీం వాలీబాల్ క్రీడలను ఆదివారం టీపీసీసీ రాష్ట్ర సభ్యుడు అర్షద్ హుస్సేన్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. సహకార సంఘం ఛైర్మన్ ఓంప్రకాశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాయి, శేఖర్ తదితరులున్నారు.

● క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు అవంతిక ఫర్టిలైజర్ దుకాణ యజమాని లంగారి భూపతి ఆధ్వర్యంలో.. దుస్తులు, వాలీబాల్ కిట్లను అందజేశారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



క్రీడలు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డబ్బా గ్రామంలో కబడ్డీ..

చింతలమానెపల్లి: గ్రామీణ యువత క్రీడ రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ నాయకులు డుబ్బుల నానయ్య, బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని డబ్బా గ్రామంలో 68వ ధమ్మచక్ర పరివర్తన్ దినోత్సవం సందర్భంగా కబడ్డీ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, పాపయ్య, బండు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏపీవో మనోహర్‌కు సన్మానం

తిర్యాణి, న్యూస్‌టుడే: ఉట్నూర్ ఐటీడీఏ ఏపీవోగా మెస్రం మనోహర్ నియమితులైన సందర్భంగా.. ఆదివారం ఆదివాసీ సేన కుమురం భీం జిల్లా అధ్యక్షుడు (తిర్యాణి మండలం కొలగాం మాజీ సర్పంచి) కోట్నాక గణపతిలు.. ఆయన స్వగృహంలో సన్మానించారు. గిరిజనుల అభివృద్ధికి, రహదారుల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు ఆయన తెలిపారు. జిల్లా కోశాధికారి మనోహర్, మాధవ్ తదితరులున్నారు.

కలుపు మొక్కల తొలగింపు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్ఆర్ఓ కాలనీలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లోని కలుపు మొక్కలను ఆదివారం భగవాన్ సత్యసాయి సేవా సమితి సభ్యులు తొలగించారు. నెల రోజుల కిందట ఆలయ పరిసరాల్లో పండ్లు, పూలమొక్కలు నాటారు. ఈ నెల 2 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత నుంచి దివ్యత్వం వరకు అనే కార్యక్రమంలో భాగంగా.. సేవా సమితి కన్వీనర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సభ్యులు శ్రమదానం చేశారు.

పద్మశాలీలను అయోమయానికి గురిచేయొద్దు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: ఇటీవల కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైనట్టు ప్రకటించుకున్న దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌ల ఎన్నికను తాము గుర్తించడం లేదని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు తెలిపారు. పట్టణ పద్మశాలి భవనంలో ఆదివారం మాట్లాడుతూ.. సంఘ నాయకులతోపాటు పద్మశాలీలను అయోమయానికి గురిచేసే చర్యలను మానుకోవాలన్నారు. అఖిల భారత సంఘానికి అనుబంధంగా తమ సంఘం కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య మాట్లాడుతూ.. పద్మశాలి భవనం వేదికగానే ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దసరా అనంతరం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

9న బతుకమ్మ సంబరాలు

పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న పద్మశాలి భవనంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కుడిక్యాల రాజమౌళి తెలిపారు. మహిళా విభాగం నేతృత్వంలో సంబరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్తమ బతుకమ్మలను గుర్తించి బహుమతులు అందజేస్తామని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల కేదారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు


అడవి పందుల బీభత్సం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పంట చేతికొచ్చే సమయంలో అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి మేరగూడ గ్రామ శివారులోని పత్తి పంటలను ధ్వంసం చేశాయి. బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ధ్వంసమైన పంటలకు నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

బంద్ ప్రశాంతం.. ఇబ్బందులు అనేకం

న్యూస్‌టుడే, జైనూర్

ఏజెన్సీ ప్రాంతంలోని జైనూర్ మండలంలో గత నెలలో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో.. 144 సెక్షన్ విధించారు. జంగాం క్రాస్‌రోడ్, దుబ్బగూడ ఎక్స్‌రోడ్, కాలేజీగూడలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా రాత్రి పగలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వచ్చి పోయే వాహనాలను క్షుణ్నంగా తనిఖీలు చేపట్టిన తర్వాతే అనుమతినిస్తున్నారు. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని ప్రజల రాకపోకలకు సమస్య లేకపోయినా ఇతర ప్రాంతాల వారికి సరైన కారణం లేకుంటే నిరాకరిస్తున్నారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తుండటంతో.. మండల కేంద్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఇదే క్రమంలో ప్రజలు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నిర్మానుష్యంగా మండల కేంద్రంలోని కుమురం భీం కూడలి


ఆన్‌లైన్ సేవలు లేక..

ఏజెన్సీ ప్రాంతంలో మొదట నెట్‌వర్క్ బంద్ చేయించినా.. తర్వాత పునరుద్ధరించారు. కానీ అంతర్జాల సేవలు ప్రారంభించలేదు. ఏజెన్సీ ప్రాంతంలోని కెరమెరి, తిర్యాణి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు ధ్రువపత్రాలు పొందేందుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అంతర్జాల సేవలు లేకపోవడంతో ఆయా ఉద్యోగాల వెరిఫికేషన్‌కు వెళ్లే అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు దివ్యాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.



జైనూర్ కాలేజీగూడ చెక్‌పోస్టు వద్ద పోలీసుల బందోబస్తు

పింఛన్లు రావడం లేదు



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నా. గత నెల పింఛన్ డబ్బులు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. ఇంటి అవసరాలకు డబ్బులు లేకపోవడంతో ఇతరుల వద్ద అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - జాదవ్ పీరాజి, లింగాపూర్

గుంతల రోడ్డు.. తప్పని అవస్థలు



మండలంలోని చిన్నరాస్పల్లి-చంద్రపల్లి రహదారి గుంతలమయంగా మారింది. బీటీ రోడ్డు పగిలి కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడిన సమయంలో గుంతల్లో నీరు నిలుస్తుండటంతో పరిస్థితి దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. చంద్రపల్లి నుంచి మామిడొర్రె సమీపం వరకు బీటీరోడ్డు వేసినా.. అటవీశాఖ అనుమతులు లేక చిన్నరాస్పల్లి వరకు రోడ్డు పనులు నిలిచిపోయాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పూర్తిచేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దహెగాం



బోనాలతో పోచమ్మ గుడికి వెళ్తున్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. వర్షాలు కురవాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలంటూ గ్రామస్థులు బోనాల పండగ జరిపారు. డప్పుచప్పుళ్లు, బాజాభజంత్రీల మధ్య మహిళలు బోనమెత్తుకుని పోచమ్మ ఆలయానికి వెళ్లారు. ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా

బెజ్జూరు, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న ఆదివాసీ కొలావార్ మన్నేవార్ సేవా సంఘం యువజన సంఘం అధ్యక్షుడు మేడి సతీష్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వెంకటేష్, పుల్లయ్య, వెంకటేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పకడ్బందీగా మహిళా చట్టాల అమలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత అన్నారు. పట్టణంలోని బాలభారతి పాఠశాలలో శనివారం ఐద్వా మహిళా సంఘం మొదటి మహాసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం అనేక చట్టాలు చేస్తున్నామని చెబుతున్నా స్వార్థపూరిత ప్రయోజనాలకే అమలవుతున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలిగా మాచర్ల వినోద, కార్యదర్శిగా దుర్గం అనిత, కోశాధికారిగా ముంజం సుధారాణి తదితరులను ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు ఆశాలత

కొలావార్లలో రాజకీయ వెనుకబాటుతనం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్టీ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆదివాసీ కొలావార్ నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. జులై 14న రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. పారిపల్లి పోశం రాష్ట్ర అధ్యక్షుడిగా, మెరిపల్లి బ్రహ్మయ్య గౌరవ అధ్యక్షుడిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్రి శ్రీనివాస్, మెరిపల్లి సదాశివ్ అధికార ప్రతినిధిగా, ఎం.రవీందర్ ప్రధాన కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా అశోక్, బుర్స రంగయ్య ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జైనూర్ ఘటన నేపథ్యంలో రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారానికి అనుమతి లభించలేదు. ఇటీవలే అనుమతి లభించడంతో సభ్యులతో కన్వీనర్ సదాశివ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. గిరిజన తెగల్లో ఆదివాసీ కొలావార్లు రాజకీయ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. విద్యలేమితోనే ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని వాపోయారు.



కుమురంభీం విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

జిల్లాలో విద్యాభివృద్ధికి మెరుగైన అవకాశాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాను విద్యాపరంగా అభివృద్ధి పరిచేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని బదిలీపై నిజామాబాద్ డైట్ కళాశాలకు వెళ్లిన జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్ పేర్కొన్నారు. ఇక్కడ అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని వారిని అధికారులు ప్రోత్సహిస్తే అన్ని విషయాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే నమ్మకం కుదిరిందని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల వారు సంయుక్తంగా ఆయనకు వీడ్కోలు అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లాలోని బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో పలు అంశాల్లో రాష్ట్రంలోనే జిల్లాను ముందుంచి ఉన్నతాధికారులు ప్రశంసలు అందుకొన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ, ఐటీడీఏ ప్రతినిధులు డీఈఓగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. డీఈవో కార్యాలయ ఎఫ్ఏవో దేవాజీ, ఏసీజీఈ ఉదయ్‌బాబు, ఎంఈవోలు రమేశ్ బాబు, జయరాజ్, శివచరణ్, డీఎస్‌వో మధుకర్, ఏసీఎంవో ఉద్ధవ్ తదితరులు హాజరయ్యారు.



డీఈవో అశోక్‌ను సత్కరిస్తున్న జిల్లాలోని వివిధ సంఘాల నాయకులు